క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక



ఎమ్మెల్యే కళావతిని కలిసిన పార్టీ రాష్ట్ర మహిళా కార్యదర్శి కామేశ్వరి

వీరఘట్టం: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శిగా ఇటీవల నియమితులైన తేజోమూర్తుల కామేశ్వరి మంగళవారం ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతిని మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర మహిళా కార్యదర్శిగా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి, ఎమ్మెల్యే కళావతికి కృతజ్ఞతలు తెలియజేశారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషిచేయాలని ఎమ్మెల్యే సూచించారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



వృద్ధులకు దుప్పట్లు అందజేస్తున్న కృష్ణమూర్తి

కొమరాడ: మండలంలోని కూనేరు, కొండకూనేరు, తుమ్మలవసల, రామభద్రాపురం గ్రామాలకు చెందిన 45 మంది వృద్ధులకు పార్వతీపురం టౌన్ పోలీస్ స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న కొమిరి కృష్ణమూర్తి మంగళవారం దుప్పట్లు, స్టీల్ గ్లాస్‌లను పంపిణీ చేశారు. భారతదేశ తొలి మహిళా గవర్నర్ సరోజిని నాయుడు జయంతి సందర్భంగా వాటిని పంపిణీ చేసినట్లు చెప్పారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



తాగునీటి బోరు తవ్విస్తున్న సర్పంచ్ గౌరీశంకర్

కురుపాం: మొండెంఖల్ పంచాయతీ పరిధిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపడుతున్నట్లు గ్రామ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఇంటికుప్పల గౌరీశంకర్ తెలిపారు. పంచాయతీ పరిధిలోని లక్ష్మీనగర్, తాబేలువలస గ్రామాల్లో మంగళవారం పంచాయతీ నిధులతో తాగునీటి బోర్లను తవ్వించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గోరవలస గణపతి, వార్డు మెంబర్ హెచ్.కుమారి, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



వెంగళరాయిపురం కేంద్రాన్ని పరిశీలించిన తహసీల్దార్ రాజ్యలక్ష్మి

బలిజిపేట: తహసీల్దార్ రాజ్యలక్ష్మి మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను మంగళవారం పరిశీలించారు. కొత్తగా విధులు చేపట్టిన ఆమె పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. కేంద్రాల వద్ద బోర్డులు, విద్యుత్, తాగునీరు, లైటింగ్ సదుపాయం ఉండాలన్నారు. ముఖ్యంగా ర్యాంప్‌లు, మరుగుదొడ్ల సదుపాయాలు ఉండాలన్నారు. కొన్ని కేంద్రాల వద్ద చిన్నచిన్న సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు.

రబీ పనుల్లో రైతులు నిమగ్నం

సీతానగరం: మండలంలో నీటి వనరులున్న గ్రామాల రైతులు రబీ వరి సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. బోరులున్న లక్ష్మీపురం, బుడ్డిపేట, తామరఖండి, బల్లకృష్ణాపురం, కొత్తవలస, పెదంకలాం, వెంకటాపురం, బూర్జ గ్రామాల రైతులు రబీ వరి సాగు చేసేందుకు అవసరమైన నారుమళ్లను శుద్ధి చేసి వరినారు పోయడంలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే అపరాల పనుల్లో ఉన్న వారంతా రబీ వరి సాగు చేయడంలో కూడా నిమగ్నమయ్యారు.

ప్రజారోగ్య భద్రతే లక్ష్యం..



వైద్య సేవలను పర్యవేక్షిస్తున్న ఎంపీడీఓ పైడితల్లి

పాలకొండ రూరల్: ప్రజారోగ్య భద్రతే లక్ష్యంగా 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా అమలు చేస్తుందని ఎంపీడీఓ జి.పైడితల్లి అన్నారు. మండలంలోని గోపాలపురం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా అన్నవరం పీహెచ్‌సీ వైద్య బృందాలు అక్కడి ప్రజలకు వైద్యసేవలు అందించారు. వైద్య పరీక్షలు చేసి మందులు అవసరమైన వారికి ఉచితంగా అందజేశారు. కంటి సమస్యలు ఉన్నవారికి అద్దాలు సమకూర్చారు.

350 మందికి వైద్య సేవలు



వైద్య సేవలందిస్తున్న ఆరోగ్య సిబ్బంది

వీరఘట్టం: మండలంలోని నడుకూరులో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలోని 350 మందికి వైద్య పరీక్షలు చేసినట్లు డాక్టర్ ప్రదీప్‌కుమార్ తెలిపారు. కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రి లీలాప్రసాదరావు ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శి మధు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కొండవాడలో..



వీరఘట్టం: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రి లీలాప్రసాదరావు, వైద్య సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని కొండవాడ గ్రామంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. శిబిరానికి వచ్చిన రోగులకు తాడికొండ పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.బుద్ధేశ్వరరావు, భద్రగిరి సీహెచ్‌సీ వైద్యుడు శ్రీకాంత్, తదితరులు వైద్య సేవలందించారు. ఎంపీడీఓ జి.జగదీష్‌కుమార్ వైద్య సేవలను పర్యవేక్షించారు. ప్రజలకు ఇంటి వద్దే మెరుగైన వైద్య సేవలందించేందుకు ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తోందని, ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇంటి వద్దే లైఫ్ సర్టిఫికెట్లు

గుమ్మలక్ష్మీపురం: మండల పరిధిలోని విశ్రాంత ఉద్యోగులకు కురుపాం ట్రెజరీ అధికారి జగదీష్ మంగళవారం లైఫ్ సర్టిఫికెట్లు అందజేశారు. గుమ్మలక్ష్మీపురం పెన్షనర్ల సంఘం చొరవతో వృద్ధాప్యం, అనారోగ్యం కారణంగా కదలలేక మంచానికే పరిమితమైన పెన్షనర్ల ఇంటికి వెళ్లి సర్టిఫికెట్లను అందజేశారు. తమ ఇబ్బందులు గుర్తించి ఇంటి వద్దకే వచ్చి లైఫ్ సర్టిఫికెట్లు అందించిన జగదీష్‌కు పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు గుడ్ల హరిప్రసాద్, నాయకులు బాబ్జిప్రసాద్, చిన్నారావు, తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.



పెన్షనర్ ఇంటి వద్దకు వెళ్లి లైఫ్ సర్టిఫికెట్ అందజేస్తున్న ట్రెజరీ అధికారి జగదీష్

తాగునీటి సమస్యకు పరిష్కారం

సీతంపేట: ఏజెన్సీలోని కుడ్డపల్లి గ్రామ సచివాలయం పరిధి అంటికొండ గ్రామంలో దశాబ్దకాలంగా వేధిస్తోన్న తాగునీటి సమస్యకు పరిష్కారం లభించింది. గత కొన్నేళ్లుగా తాగునీటి కోసం గ్రామస్తులు అనేక అవస్థలు పడుతున్నారు. గ్రామంలో ఇటీవల నిర్వహించిన 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో గ్రామస్తులు తాగునీటి సమస్యను ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి దృష్టికి తీసుకువెళ్లారు. ఆమె వెంటనే స్పందించి గ్రామ సచివాలయానికి మంజూరైన రూ.40 లక్షల నుంచి రూ.2 లక్షలు ఖర్చు చేసి మినీ రక్షిత పథకాన్ని ఏర్పాటు చేశారు. దీంతో గ్రామస్తులకు తాగునీటి సమస్య తీరింది. మినీ రక్షిత పథకాన్ని స్థానిక సర్పంచ్ బాపయ్య, పంచాయతీ కార్యదర్శి పాపారావు, స్వాతి, శరత్ మంగళవారం ప్రారంభించారు. జగనన్న ప్రభుత్వంలో మంచినీటి సమస్య పరిష్కారమైందని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



మినీ రక్షిత పథకాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ బాపయ్య, తదితరులు

టీడీపీ ప్రభుత్వంలోనే అవినీతి



మాట్లాడుతున్న ఎంపీపీ ఆదినారాయణ

సీతంపేట: టీడీపీ ప్రభుత్వంలోనే ఐటీడీఏలో భారీ అవినీతి జరిగిందని ఎంపీపీ బి.ఆదినారాయణ, జెడ్పీటీసీ ఎస్.లక్ష్మి, ఏఎంసీ చైర్మన్ మోహనరావు ఆరోపించారు. సీతంపేటలో మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. లోకేష్ మంత్రిగా ఉన్నప్పుడు సీతంపేట అడ్వెంచర్ పార్కును ప్రారంభించిన సందర్భంలో రూ.80 లక్షలు ఖర్చు చూపించారని ఆరోపించారు. దీనిలో భోజనాలకు రూ.40 లక్షలు, మిగతాది ఆర్టీసీ బస్సుల ద్వారా ప్రజలను తీసుకురావడానికి ఇతర ఖర్చుల కింద లెక్కలు వేశారన్నారు. రెండు గంటల పర్యటనకు ఇంత ఖర్చు చూపి గిరిజన నిధులు దుబారా చేశారన్నారు. టీడీపీ హయంలో ఎటువంటి అభివృద్ధి లేదన్నారు. రహదారులు, మంచినీరు, వైద్యసౌకర్యాలు లేక ఏజెన్సీ వాసులు అల్లాడిపోయారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే ఐటీడీఏ పరిధిలో గిరిజన రైతులు దాదాపు 25 వేల కుటుంబాలకు కొండపోడు పట్టాలు ఇచ్చి రైతు భరోసా కల్పించిన ఘనత దక్కుతుందన్నారు. వైద్యం కోసం సీతంపేటలో రూ.50 కోట్లతో మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి, రూ.22 కోట్లతో 30 పడకల ఆస్పత్రిని వందపడకలుగా అప్‌గ్రేడేషన్ చేశారన్నారు. ప్రతీ పీహెచ్‌సీనీ ఆధునీకరించారన్నారు. అలాగే నాడు-నేడు నిధులతో ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో మౌలిక వసతులు కల్పించినట్లు చెప్పారు. కార్పొరేట్ తరహాలో విద్య గిరిజన పిల్లలకు అందుతోందన్నారు. సీతంపేటలో నిరుద్యోగుల సౌకర్యార్థం నైపుణ్య కళాశాల పెట్టిన ఘనత జగనన్నకు దక్కుతుందున్నారు. గ్రామాలకు రహదారులు, వరదగోడలు వంటివి నిర్మించి ఆదుకున్నారన్నారు. పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో తిరిగి ఒక్కో సచివాలయానికి రూ.40 లక్షలు నిధులు వచ్చే విధంగా చర్యలు తీసుకున్నారు. జీజీ ఎంపీ నిధులతో సీసీరోడ్లు, కాలువాలు, మంచినీటి సదుపాయాలు గ్రామాల్లో కల్పించడం జరిగిందన్నారు. జగనన్నను, ఎమ్మెల్యే కళావతిని విమర్శించే హక్కు ఎవ్వరికీ లేదన్నారు.

వైఎస్సార్‌సీపీలో పలువురి చేరిక



పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస: మండలంలోని పల్లపుసిరిపి, నడిమిసిరిపి గిరిజన గ్రామాలకు చెందిన 45 కుటుంబాలకు చెందిన గిరిజనులు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. చినమేరంగిలోని ఎమ్మెల్యే స్వగృహంలో మంగళవారం వారంతా వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి, పార్టీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనకు ఆకర్షితులై తామంతా పార్టీలో చేరినట్లు తెలిపారు. పార్టీలో చేరిన వారిలో కె.కస్తూరి, ప్రశాంత్, రామయ్య, ఎం.సత్యం, జగ్గారావు, పి.గంధారావు ఉన్నారు.

లోకేష్ మద్యం మత్తులో మాట్లాడుతున్నాడు



పాలకొండ, పాతపట్నంలో నిర్వహించిన శంఖారావం సభకు నారా లోకేష్ మద్యం మత్తులో వచ్చి మాట్లాడుతున్నట్లుంది. జాబ్ క్యాలెండర్‌కు, సాక్షి క్యాలెండర్‌కు తేడా తెలియని వ్యక్తి లోకేష్. నిరుద్యోగులకు రెండు నెలలు ఓపిక పట్టండని చెప్పావు కదా, మీరు అధికారం ఉన్నప్పుడు నిరుద్యోగులకు ఎందుకు ఉద్యోగాలు ఇవ్వలేకపోయావు. పైగా నిరుద్యోగ భృతి అన్నావు, అదీ లేదు. ఇప్పుడు మీరు అధికారంలోకి వస్తే 20 లక్షల ఉద్యోగాలు ఇస్తానంటున్నావు. అది ఎలా సాధ్యం? ఇటువంటి తప్పుడు హామీలతో ప్రజలను మోసగించలేవు. జగన్‌ను చూస్తే జైలు గుర్తుకు వస్తుందంటున్నావు.. నిన్ను చూస్తే ఐరన్ లెగ్, స్కామ్‌లు ప్రజలకు గుర్తుకు వస్తున్నాయి. నీ శంఖారావానికి స్టాండ్‌లేదు.

– తోజోమూర్తుల కామేశ్వరి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి

రాజకీయ పరిజ్ఞానం లేని వ్యక్తి లోకేష్



ఒక కొత్త ప్రాంతానికి వచ్చినప్పుడు అక్కడి రాజకీయ, సామాజిక పరిస్థితులతో పాటు ప్రతినిత్యం వహిస్తున్న వారి గూర్చి కూడా తెలిసుండాలి. అయితే శంఖారావం పేరుతో పాలకొండ వచ్చిన లోకేష్ ఇక్కడ పరిస్థితులపై కనీస అవగాహన లేకుండా మాట్లాడడంతో ఆయనకు రాజకీయ పరిజ్ఞానం లేదని మరోసారి రుజువైంది.

– దమలపాటి వెంకటరమణనాయుడు, ఎంపీపీ, వీరఘట్టం

లోకేష్ ముందే తన్నుకున్న తమ్ముళ్లు



పాలకొండ టీడీపీలో ఉన్న వర్గపోరు మరోసారి బహిర్గతమైంది. శంఖారావం సభకు వచ్చిన తెలుగు తమ్ముళ్లు లోకేష్ ముందే తన్నుకున్నారు. ఇటీవల మేము మండలాల్లో నిర్వహించిన వైఎస్సార్ ఆసరాకు వచ్చిన జనాలు కూడా రాకపోవడంతో లోకేష్ శంఖారావం వెలవెలబోయింది. లోకేష్ శంఖారావం వల్ల ఇక్కడ టీడీపీలో విభేదాలు పెరిగాయే తప్ప వైఎస్సార్‌సీపీకి ఎటువంటి ఇబ్బంది లేదు. – పొట్నూరు లక్ష్మణరావు, ఏఎంసీ వైస్ చైర్మన్, పాలకొండ

మీ మోసాలను ప్రజలు నమ్మే స్థితిలో లేరు



సూపర్ సిక్స్ అంటూ ఆరు మోసాలతో, శంఖారావం పేరుతో ప్రజలను మోసగించేందుకు నారా లోకేష్ ఇక్కడికి వచ్చారు. మీ మోసాలను మా ప్రాంత ప్రజలు నమ్మరు. ఇంతకీ ఇక్కడ టీడీపీకి టికెట్ ఇస్తారా, జనసేనకు ఇస్తారో తేల్చుకోండి. మీరు ఎన్ని మోసపూరిత హామీలతో వచ్చినా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విశ్వాసరాయి కళావతే రానున్న ఎన్నికల్లో గెలుస్తారు. – వైశ్యరాజు గోవిందరాజు, కో-ఆప్షన్ సభ్యుడు, బిటివాడ, వీరఘట్టం మండలం

వైద్య సేవలపై డీఎంఓ ఆరా..

జియ్యమ్మవలస: ప్రజారోగ్యం దృష్ట్యా గ్రామీణ స్థాయిలో అందుబాటులో ఉన్న వైద్య సేవలపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని జిల్లా మలేరియా అధికారి టి.జగన్మోహనరావు అన్నారు. మండలంలోని రావాడ రామభద్రపురం పీహెచ్‌సీ, చినమేరంగి సీహెచ్‌సీలను మంగళవారం పరిశీలించారు. చినమేరంగి సీహెచ్‌సీలో ల్యాబ్ పరీక్షల రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం అల్లువాడలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పరిశీలించి అక్కడ అందిస్తున్న వైద్య సేవలపై ఆరాతీశారు. గ్రామాల్లో అందిస్తున్న వైద్య సేవలను దీర్ఘకాలిక రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ శంకర్, డాక్టర్ జగదీష్, ఏఎంఓ సూర్యనారాయణ, సిబ్బంది ఉన్నారు.



అల్లువాడ ఆస్పత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంఓ జగన్మోహనరావు

నేడు మండల సమావేశం

భామిని: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.కిశోర్‌కుమార్ తెలిపారు. ఎంపీపీ తోట శాంతికుమారి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

సీహెచ్‌డబ్ల్యూలను ఆశ వర్కర్లుగా మార్చాలి

సీతంపేట: కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశా కార్యకర్తలుగా మార్చాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణరావు తెలిపారు. స్థానిక గిరిజన సంఘ కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హెల్త్ వర్కర్లకు నెలకు రూ.10 వేలు వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధనకు ఈనెల 14,15,16 తేదీల్లో ఐటీడీఏల వద్ద సామూహిక నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు చెప్పారు. అనంతరం ఐటీడీఏ ఏపీఓ రోసిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి ఎం.కాంతారావు, ఎస్.మాలతి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రమణారావు

అభివృద్ధికి అధిక ప్రాధాన్యం

పార్వతీపురం టౌన్: మండల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఎంపీపీ మజ్జి శోభారాణి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మజ్జి శోభారాణి ఆధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శాఖల వారీగా అభివృద్ధి పనులపై సభ్యులతో చర్చించారు. మండలానికి సంబంధించి అభివృద్ధి పనులపై అజెండాను ఎంపీడీఓ అకీబ్ జావేద్ వినిపించారు. అనంతరం సభ్యుల ఆమోదంతో అభివృద్ధి పనులకు సంబంధించి తీర్మానం చేశారు. మండలాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు ఎప్పటికప్పుడు ప్రణాళికలు రూపొందించి అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఆమె తెలిపారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు సిద్దా జగన్నాథం, బంకురు రవికుమార్, ఏఎంసీ చైర్మన్ మరడాన భాగ్యశ్రీ, జెడ్పీటీసీ బలగ రేవతమ్మ, ఎంటీసీలు, సర్పంచ్‌లు, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకుల్లో నేరాల నివారణకు చర్యలు

పార్వతీపురం టౌన్: బ్యాంకుల్లో నేరాల నివారణకు చర్యలు చేపడుతున్నట్టు సీసీఎస్ సీఐలు ఎం.అప్పారావు, సుధాకర్ అన్నారు. పార్వతీపురం టౌన్ పోలీసుస్టేషన్ ఆవరణలో అన్ని బ్యాంకు శాఖల బ్రాంచ్ మేనేజర్లతో సీసీఎస్ పోలీసులు, లా అండ్ ఆర్డర్ పోలీసులు సంయుక్తంగా మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు ఆవరణలో, చుట్టుప్రక్కల ఎక్కువ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సీసీ ఎస్ ఎస్‌ఐలు రమణరావు, రమణా రెడ్డి, పీపీపీ టౌన్ లాఅండ్‌ఆర్డర్ ఎస్ఐ రవీంద్రరాజు తదితరులున్నారు.

ఎమ్మెల్యే కళావతిపై ఆరోపణలు సరికాదు

భామిని: పాలకొండ శాసన సభ్యురాలు విశ్వాసరాయి కళావతిపై టీడీపీ నాయకుడు నారా లోకేష్ చేసిన అవనీతి ఆరోపణలను భామిని మండల వైఎస్సార్‌సీపీ నాయకులు ఖండించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం, వైస్ ఎంపీపీ బోనగడ్డి ధర్మారావు, జేసీఎస్ కోఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్‌తో కలిసి మంగళవారం విలేకరులతో మాట్లాడారు. అవినీతి మరక లేని నాయకురాలిగా ప్రజల్లో గుర్తింపు తెచ్చుకొన్న గిరిజన ముద్దుబిడ్డ ఎమ్మెల్యే కళావతిపై ఇసుక దోపిడీ ఆరోపణలు చేయడం లోకేష్ స్థాయికి సరిపోదని విమర్శించారు. మీ తండ్రి చంద్రబాబు అధికారంలో ఉండగా ఎమ్మెల్యే కళావతికి రూ.20 కోట్లు, మంత్రి పదవి ఇస్తామని ప్రలోభాలకు గురిచేసినా.. ఆమె వాటిని తిరస్కరించి జగనన్న వెంట నడిచారని, విశ్వాసానికి గుర్తుగా నిలిచారని అన్నారు. గతంలో భామిని మండలంలో టీడీపీ నాయకులు బిల్లుమడ, పసుకుడి గ్రామాల వద్ద ఇసుక ర్యాంపుల ద్వారా కోట్లాది రూపాయలు స్వాహా చేయలేదా అని ప్రశ్నించారు. ప్రస్తుతం జగనన్న ప్రభుత్వం ప్రభుత్వ కార్యాలయాలు, పేదల ఇళ్ల నిర్మాణానికి మాత్రమే ఇసుక సరఫరా చేసేందుకు ఇసుక ర్యాంపులను నిర్వహిస్తోందన్నారు. ఇతరులపై ఆరోపణలు చేసే ముందు మీ కార్యకర్తల గుణగణాలపై ఆరా తీయాలని సూచించారు. పార్టీ మండల నాయకులు గెల్లంకి రమేష్, రొక్కం రమేష్, బొడ్డేపల్లి ప్రసాద్, గిరిజన సంఘ నాయకులు కొండగొర్రి చంటి, పిరపక శ్రీను, పత్తిక సింహాచలం, బిడ్డిక అనంతరావు, తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సక్రమంగా ఓటర్ల జాబితాలు రూపొందించాలి

పాలకొండ: ఓటర్ల జాబితాలు సక్రమంగా తయారు చేయాలని తహసీల్దార్ వరహాలు అన్నారు. మండలంలోని బీఎల్ఓలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. పోలింగ్ బూత్‌ల వారీగా ఓటర్ల జాబితాలపై వచ్చిన అభ్యంతరాలు, వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. తుది జాబితాలను ఇప్పటికే తయారు చేశామని, అందులో మార్పులు ఉంటే విధిగా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.



బీఎల్ఓలతో సమీక్ష నిర్వహిస్తున్న తహసీల్దార్

● మది దోచే సోయగం..

మన్యంలో ప్రకృతి రమణీయత చూపరులను కనువిందు చేస్తోంది. వేకువ చీకటిని తరిమేస్తూ.. కురిసిన పొగమంచును చీల్చుకుంటూ.. కొండల మధ్యలో నుంచి ఎర్రని సూర్యుడు బయటికొస్తున్న తరుణంలో ఆకాశంలో నెలకొనే సూర్యకిరణాల వెలుగులు ప్రకృతి ప్రేమికుల మదిని దోచుకున్నాయి. -గుమ్మలక్ష్మీపురం



తాడికొండల నడుమ కనువిందు చేస్తున్న భానుడు



గుమ్మలక్ష్మీపురం ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాల నుంచి ఆకర్షణీయంగా కనిపిస్తున్న సూర్యకాంతులు